


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 10 డిసెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 108 పేజీలు : 4 వెల : రూ 3-00


### శీతాకాల సమావేశాల్లో..

## తొలిసారి సజావుగా సాగిన రాజ్యసభ



న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన పది రోజుల తర్వాత రాజ్యసభా కార్యక్రమాలు తొలిసారి సజావుగా సాగాయి. సభ లోపల, బయట కొనసాగిస్తున్న నిరసనలకు విపక్ష సభ్యులు గురువారం విరామం ఇచ్చారు. తమిళనాడులో సైనిక హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్, ఆయన భార్య, మరో 11 మంది రక్షణ సిబ్బందికి నివాళి అర్పించారు.నవంబర్ 29న పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమ య్యాయి. కాగా, గత సమావేశాల్లో భద్రతా సిబ్బంది పట్ల అమర్యాదగా ప్రవర్తించిన 12 మంది సభ్యులను శీతాకాల సమావేశాల వరకు సస్పెండ్ చేశారు. దీంతో రాజ్యసభలో తొలి రోజు నుంచే విపక్ష సభ్యులు నిరసనకు దిగారు. 12 మంది సభ్యుల సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సభ లోపల, వెలుపల నిరసనలు కొనసాగిస్తున్నారు. బుధవారం టీడీపీ, వైసీఎస్ఆర్‌సీపీ సభ్యులు తప్ప మిగతా పార్టీలకు చెందిన సభ్యులు సభా కార్యక్రమాలను బహిష్కరించారు. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేశారు.కాగా, హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన బిపిన్ రావత్, ఇతరులకు నివాళి అర్పించేందుకు గురువారం మాత్రమే నిరసనలకు విరామం ఇచ్చినట్లు రాజ్యసభ్యలో విపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే గురువారం తెలిపారు. అయితే ఈ ఘటనపై మాట్లాడేందుకు విపక్ష సభ్యులకు అవకాశం ఇవ్వని డిప్యూటీ చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ జీరో హవర్, ప్రశ్నోత్తరాలు సజావుగా సాగేందుకు సహకరించామన్నారు.

## నీటి ప్రాజెక్టులపై సీఎం జగన్ కీలక ఆదేశాలు



**ప్రాజెక్టులు, రిజర్వాయర్ల భద్రత, నిర్వహణపై సీఎం ఆదేశాలు**

**ఇదివరకు ఇచ్చిన ఆదేశాలపై పురోగతిని వివరించిన అధికారులు**

అమరావతి: రాష్ట్రంలో వివిధ నీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్ల భద్రత, నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఉదయం తన కార్యాలయ సంబంధిత అధికారులతో సీఎం సమావేశమయ్యారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద సమగ్ర పరిశీలనచేయాలన్నారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల వద్ద నిర్వహణా పరిస్థితులు సరిదిద్దాలని, రాష్ట్ర విభజన నాటినుంచి దీనిగురించి పట్టించుకోలేదన్నారు. దీనివల్ల ముప్పు ఏర్పడే పరిస్థితులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల వారీగా నిర్వహణకోసం తగినంత సిబ్బంది ఉన్నారా? లేదా? అన్నదానిపై లెక్కలు తీయాలన్నారు. అవసరమైన సిబ్బందిని నియమించాలని ఆదేశాలు జారీచేశారు. గత సమీక్షా సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ దిశగా ప్రభుత్వ యంత్రాంగం కొన్ని చర్యలు చేపట్టిందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జవనరులశాఖ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ, రెవెన్యూ?విపత్తు నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జలవనరులశాఖ ఇంజినీర్‌ఇన్ ఛీఫ్‌లతో కమిటీని ఏర్పాటుచేసిన విషయాన్ని ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఐఐటీ, జేఎన్‌టీయూ నిపుణుల కమిటీకి జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఛైర్మన్‌గా ఉన్నారని, తీసుకోవాల్సిన చర్యలను అత్యున్నత కమిటీకి తెలియజేస్తున్నారని వివరించారు. సీఎం ఇచ్చిన ఆదేశాల మేరకు వివిధ ప్రాజెక్టుల నిర్వహణపై గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన నివేదికలను కూడా అత్యున్నతస్థాయి కమిటీ పరిశీలిస్తోందన్నారు. తాజా వచ్చిన వరదలను, కుంభవృష్టిని పరిగణలోకి తీసుకుని ఆమేరకు తగిన సూచనలు చేస్తుందన్నారు. ఆటోమేషన్ రియల్ టైం డేటాకు కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానించే వ్యవస్థపైన కూడా చీఫ్ సెక్రటరీతో కూడిన అత్యున్నత బృందం దృష్టిసారించిదని ముఖ్యమంత్రికి వివరించారు. అన్ని మేజర్, మీడియం రిజర్వాయర్లు, బ్యారేజీల నిర్వహణకు అదనపు సిబ్బంది నియామకం, అలాగే వాటర్ రెగ్యులేషన్‌కోసం కూడా సిబ్బంది నియామకంపై ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని అధికారులు తెలియజేశారు. వీరి నియామకానికి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పెద్దమొత్తంలో నీటిని విడుదల చేసిన పక్షంలో ఆస్తినష్టం, ప్రాణనష్టానికి ఆస్కారమున్న లోతట్టుప్రాంతాలను గుర్తించే పనినికూడా కమిటీ చేస్తోందని కూడా అధికారులు తెలిపారు.

## కరోనా వ్యాక్సినేషన్‌లో తెలంగాణ మరో మైలురాయి

హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా టీకా పంపిణీ మరో మైలురాయిని అధిగమించింది. గురువారం ఉదయం వరకు కరోనా వ్యాక్సినేషన్ 4 కోట్ల మార్కును దాటింది. ఇప్పటివరకు అర్హులైన 95 శాతం మందికి మొదటి డోసు పంపిణీ చేశారు. రెండో డోసు 50 శాతం పూర్తయిందని రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపింది.రాష్ట్రంలో ఈ ఏడాది జనవరి 16న కరోనా వ్యాక్సినేషన్ ప్రారంభమయింది. అప్పటి నుంచి 165 రోజుల్లో కోటి డోసులను పంపిణీ చేశారు. వ్యాక్సినేషన్ మరో 78 రోజుల్లోనే రెండు కోట్ల మార్కును చేరింది. ఇక కేవలం 27 రోజుల్లోనే అంటే అక్టోబర్ 23 నాటికి మరో కోటి డోసుల వ్యాక్సిన్లను పంపిణీ చేశారు. నాలుగు కోట్ల మైళురాయిని దాటడానికి మరో 45 రోజుల సమయం పట్టింది. కాగా, అర్హులైనవారిలో ఇప్పటివరకు 18 లక్షల మంది వ్యాక్సిన్ తీసుకోలేదని సమాచారం.



## శబరిమల సమీపంలో ఘోర ప్రమాదం..





కేరళ: శబరిమల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కర్నూలుకు చెందిన ఇద్దరు మృతి చెందారు. నగరంలోని బుధవారపేటకు చెందిన అయ్యప్ప స్వాములు టెంపోలో శబరిమలకు వెళ్లారు. శబరిమలకు 60 కి.మీ. దూరంలో టెంపో వాహనాన్ని నిలిపి.. టీ తాగుతున్నారు. అదే సమయంలో వెనుక నుంచి మరో వాహనం వచ్చి టెంపోను ఢీ కొట్టి.. భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చనిపోయినట్లు ప్రాథమిక సమాచారం. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి.బుధవారం ఉదయం 8:30 గంటల సమయంలో కర్నూలు నగరం నుంచి 11 మంది అయ్యప్ప భక్తులు శబరిమలకు బయలుదేరారు. గురువారం ఉదయం 9:30 గంటల సమయంలో శబరిమలకు 60 కి.మీ. దూరంలో టెంపో వాహనాన్ని నిలిపి.. టీ తాగుతుండగా వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొనగా ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరు మృతి చెందగా, మిగిలిన 9 మందికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి, క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. కేరళ పోలీసులు కర్నూలు పోలీసులకు తెలియజేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

## ఆళ్ల రామకృష్ణారెడ్డిని ఎద్దేవాచేసిన లోకేష్



గుంటూరు: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని టీడీపీ నేత లోకేష్ ఎద్దేవాచేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆర్కే.. మంగళగిరి నియోజకవర్గానికి గెస్ట్ లెక్చరర్‌గా మారారని విమర్శించారు. వారానికోసారి వచ్చి ఫొటోలు దిగి జంప్ అయిపోతున్నారని ఎద్దేవాచేశారు. వైసీపీ పాలనలో మంగళగిరిలో అభివృద్ధి శూన్యమన్నారు. లోకేష్ గెలిస్తే ఇళ్లు పీకేస్తాడంటూ దుష్ప్రచారం చేసిన ఆర్కే.. ఇప్పుడు పేదవాళ్ల ఇళ్లను కూలగొట్టడం దారుణమని మండిపడ్డారు. మంగళగిరిలో వేలాదిగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లు తొలగించారని ఆరోపించారు. సీఎం ఉంటున్న నియోజకవర్గంలోనే అభివృద్ధికి దిక్కులేదని తప్పుబట్టారు. చెత్త సీఎంల జాబితాలో దేశంలోనే జగన్‌రెడ్డి నెంబర్ వన్ అని లోకేష్ ధ్వజమెత్తారు.

## ముగిసిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ భేటీ




హైదరాబాద్: కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ భేటీ ముగిసింది. వర్చువల్ భేటీకి రెండు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు హాజరైనారు. తెలంగాణ, ఏపీ సాగు, తాగునీటి అవసరాలపై అధికారులు చర్చించారు. 15 రోజుల్లో ముగిసే ఖరీఫ్ పంట కోసం కాకుండా.. రాబోయే యాసంగి సీజన్ కోసం చర్చించాలని తెలంగాణ సూచించింది. తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్ ప్రతిపాదనకు ఏపీ సుముఖత వ్యక్తం చేసింది. యాసంగి సీజన్‌కు సాగునీటి కోసం 150 టీఎంసీలు.. తాగునీటి కోసం 90 టీఎంసీలు అవసరమౌతాయని తెలంగాణ పేర్కొంది. ఖరీఫ్ 15 రోజుల సీజన్ కోసం 23 టీఎంసీలు కావాలని ఏపీ కోరింది. త్వరలో మీటింగ్ పెట్టి నిర్ణయం తీసుకుందామని కేఆర్ఎంబీ తెలిపింది.

## జగన్ సర్కార్ మరో యూ టర్న్...గ్రామ కార్యదర్శులపై జీవో వెనక్కి

అమరావతి: రాష్ట్రంలో అనేక విషయాలపై వెనక్కి తగ్గుతున్న జగన్ సర్కార్ మరో జీవోపై యూటర్న్ తీసుకుంది. గ్రామ కార్యదర్శులను మహిళా కానిస్టేబుళ్లుగా మారుస్తూ జారీ చేసిన జీఓ నెంబరు 59ను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. గురువారం జీవో నెం.59పై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ క్రమంలో జీవోను ఉపసంహరించుకుంటామని ప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. గ్రామ కార్యదర్శులను మహిళా కానిస్టేబుళ్లుగా మారుస్తూ గతంలో ఏపీ సర్కార్ జీవో నెంబరు 59ను జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ హైకోర్టులో పలువురు పిటీషన్లు దాఖలు చేశారు. పిటీషనర్ల తరపున న్యాయవాది నర్రా శ్రీనివాస్ వాదనలు వినిపించారు. గ్రామ కార్యదర్శులకు కానిస్టేబుళ్లుగా మార్చి వారికి పోలీసు డ్రస్ ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జీఓను ఉపసంహరించి వారి సేవలను ఎలా ఉపయోగించుకోవాలో ప్రభుత్వం ఆలోచిస్తుందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.




## సైనికుడు సాయితేజ కుటుంబానికి అండగా మంచు కుటుంబం




చిత్తూరు: తమిళనాడులో జరిగిన ఆర్మీ హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన చిత్తూరుకు చెందిన సైనికుడు సాయి తేజ్ కుటుంబానికి మంచు మోహన్ బాబు కుటుంబం అండగా నిలిచింది. లాన్స్ నాయక్ సాయి తేజ ఇద్దరు పిల్లలను ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తానని హీరో మంచు విష్ణు వెల్లడించారు. త్వరలోనే చిత్తూరుకు వచ్చి సాయి తేజ కుటుంబాన్ని కలుస్తానని పేర్కొన్నారు. కాగా సాయితేజ అంత్యక్రియలు శుక్రవారం చిత్తూరు జిల్లా రేగడిపల్లిలో నిర్వహించనున్నారు.కాగా తమిళనాడు కూనూర్ సమీపంలో బుధవారం జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో భారత తొలి సీడీఎస్(చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్) జనరల్ బిపిన్ రావత్, ఆయన సతీమణి మధులిక, మరో 11 మంది దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. పొగమంచు పేరుకుపోయిన వాతావరణంలో ఎంఐ? 17వీహెచ్ హెలికాప్టర్ ప్రమాదానికి గురైందని, దీంతో అందులో ప్రయాణిస్తున్న 13మంది మరణించారని, ఒక్కరు మాత్రమే గాయాలతో బయటపడ్డారని వైమానిక శాఖ ప్రకటించింది. ఆర్మీ హెలికాప్టర్ ప్రమాదంలో చిత్తూరు జిల్లాకు చెందిన లాన్స్ నాయక్ సాయితేజ కూడా మరణించారు. ఊహించిన ఈ ఘటనతో సాయితేజ స్వస్థలం కురబలకోట మండలం ఎగువరేడ గ్రామం షాక్‌కు గురైంది.

## ప్రధాని మోదీని కలిసిన ఎంపీ విజయసాయిరెడ్డి

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి గురువారం కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై ప్రధానితో విజయసాయిరెడ్డి చర్చించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో లేవనెత్తిన ముఖ్యమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించామని విజయసాయిరెడ్డి ట్విట్టర్‌లో వెల్లడించారు



# సంపాదకీయం

శుక్రవారం 10 డిసెంబరు 2021

## పెరిగిపోతున్న ఆదాయ అసమానతలు

దేశంలో రోజురోజుకీ ఆదాయ అసమానతలు భారీగా పెరిగిపోతున్నాయి. ధనిక ప్రజలు మరింత ధనవంతులు అవుతుంటే.. పేద ప్రజలు ఇంకా పేదరికంలో జారుకుంటున్నారు. 2021 జాతీయ ఆదాయంలో ఐదో వంతు కేవలం ఒక శాతం మంది దగ్గరే ఉన్నట్లు ప్రపంచ అసమానత నివేదిక తెలిపింది. భారత్‌లో ఆదాయపరమైన అసమానతలు భారీగా పెరిగిపోతున్నట్లు వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ నివేదిక వెల్లడించింది. 2021లో మొత్తం జాతీయ ఆదాయంలో ఒక శాతం ధనవంతులైన భారతీయుల వద్ద 22 శాతం సంపద కలిగి ఉన్నారని ఈ నివేదిక తెలిపింది. ఇక ధనవంతుల జాబితాలో ఉన్న తొలి 10 శాతం మంది చేతిలో 57 శాతం ఆదాయం ఉన్నట్లు పేర్కొందిఆదాయ అసమానతలు ఎక్కువగా ఉన్న దేశాల్లో ఇండియా కూడా ఉందని వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్ 2022 వెల్లడించింది. దేశంలో పేదరికం పెరిగిపోతోందని తెలిపింది. ఆదాయంలో ఉన్నత వర్గాల వాటా ఏటేటా పెరిగిపోతుంటే, కిందిస్థాయిలో ఉన్నోళ్ల వాటా ఇంకా తగ్గుతోందని పేర్కొంది. దేశ ఆదాయంలో 65 శాతం కేవలం 10 శాతం మంది దగ్గర, అందులోనూ 22 శాతం ఆదాయం కేవలం ఒక్క శాతం జనాభా దగ్గరే ఉందని తెలిపింది. అట్టడుగు వర్గాలకు చెందిన 50 శాతం జనం సంపాదించే మొత్తం కేవలం 13 శాతమేనని వివరించింది.దేశంలో సగటున ఒక్కో వ్యక్తి ఆదాయం రూ.2,04,200 ఉండగా.. 50 శాతం జనాభా సంపాదించేది కేవలం రూ.53,610 మాత్రమేనట. వీరికి 20 రెట్లు ఎక్కువగా.. 10 శాతం జనాభా ఆదాయం రూ.11,66,520 ఉందన్నారు. మధ్య తరగతి వారి వద్ద 29.5 శాతం సంపద ఉందని వెల్లడించింది. అదే పైన ఉన్న 10 శాతం మంది వద్ద 65 శాతం, 1 శాతం మంది దగ్గర 33 శాతం సంపద ఉన్నట్లు తెలిపింది. మధ్యతరగతి వారి వద్ద సగటున రూ.7,23,930ల సంపద ఉన్నట్లు నివేదించింది. అదే పైన ఉన్న 10 శాతం మంది దగ్గర సగటున రూ.63,54,070, ఒక శాతం మంది వద్ద రూ.3,24,49,360 సంపద ఉన్నట్లు తెలిపింది. జెండర్ విషయంలో..ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంస్కరణల వల్ల ఉన్నత వర్గాలకు చెందిన ఒక్క శాతం మంది భారీగా లాభపడ్డారని ఈ రిపోర్టు తెలిపింది. జెండర్ విషయంలోనూ దేశంలో ఇనీక్వాలిటీ ఎక్కువే ఉందని చెప్పింది. ఆసియాలో ఒక్క చైనా తప్ప మిగతా దేశాల్లో మహిళా కార్మిక ఆదాయ వాటా 21 శాతం ఉండగా.. ఇండియాలో ఇది కేవలం 18 శాతం మాత్రమేనని వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్టు వెల్లడించింది. 1985 తర్వాత ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక సంస్కరణల వల్ల ఆదాయ, సంపద విషయంలో అసమానతల్ని పెంచాయని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా పైన ఉన్న ఒక శాతం మంది ఆర్థిక సంస్కరణల వల్ల భారీ లబ్ధి పొందారని తెలిపింది. తక్కువ, మధ్య ఆదాయ సమూహాల మధ్య వృద్ధి సాపేక్షంగా ఉన్నట్లు పేర్కొంది. 1985 తర్వాత నుంచి నేటికి పేదరికం పెరుగుతున్నట్లు ఈ నివేదిక తెలిపింది. అలాగే, దేశంలో లింగ అసమానతలు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయి. మహిళా కార్మిక ఆదాయ వాటా కేవలం 18 శాతం అని తెలిపింది. ఆసియాలో చైనా మినహా మహిళా కార్మిక ఆదాయ వాటా 21 శాతం కంటే తక్కువ ఉన్నట్లు తెలిపింది. సంపదలో కింద ఉన్నవారి సగటు ఏడాది సంపద రూ.53,610 అయితే, టాప్ 10 సంపన్నుల ఆదాయం చాలా ఎక్కువగా ఉంది. భారత్‌లోని కుటుంబాల సగటు రూ.9,83,010గా ఉంది. 1985 తర్వాత ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఆర్థిక విధానాలు ఆదాయ, సంపద విషయంలో అసమానతలను పెంచాయని నివేదిక తెలిపింది. ముఖ్యంగా పైన ఉన్న 1 శాతం మంది ఆర్థిక సంస్కరణల వల్ల భారీ లబ్ధి పొందారని తెలిపింది.

## 80 ఏళ్ల తర్వాత విశాఖ కనుమరగువుతుందా

విశాఖపట్టణం, డిసెంబర్ 9 (న్యూస్ పల్స్)రాబోయే తరాలు విశాఖను చూడలేవు. చూద్దామన్నా కనపడదు. ఎందుకంటే అప్పటికి ఆ నగరం సముద్ర గర్భంలో కలిసిపోతుంది. వినడానికి కఠినంగా ఉన్నా.. ఇది నమ్మక తప్పని నిజం. రచ్చబండ మీద కూర్చున్న వాళ్లు పొద్దుపోక చెప్పుకునే కబురు కాదిది.. ఎంతో సుదీర్ఘ అధ్యయనం చేసిన తర్వాత నిపుణులు చేసిన హెచ్చరిక ఇది. ఇప్పుడు సముద్రపు కోతలు.. సముద్రంలో జరుగుతున్న పరిణామాలే దీనికి సంకేతాలు. విశాఖ సముంద్రంలో కలిసిపోతుందని జాతీయ సముద్ర విజ్ఞాన శాస్త్ర కేంద్రం, వైజాగ్ మాజీ డైరెక్టర్, సముద్ర విజ్ఞాన శాస్త్రవేత్త.. ఖా మూర్తి అంచనా వేస్తున్నారు. ఈ అభిప్రాయం మూర్తి ఒకరిదే కాదు.. సుమారు 4 దశాబ్దాలపాటు పరిశోధనలు చేసిన ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది.ఈ మధ్య కాలంలోనే ఐపీసీసీ తీవ్ర హెచ్చరికలు కూడా చేసింది. గ్లోబల్ వార్మింగ్?తో పాటు ఇతర కాలుష్యాల వల్ల దేశంలో ఊహించని విధంగా వాతావరణ మార్పులు చోటుచేసుకోనున్నాయని తెలిపింది. సముద్రపు జలాలు భారీ స్థాయిలో పెరిగిపోయి.. దేశంలోని 12 కీలక తీరప్రాంత పట్టణాలు మునిగిపోతాయని హెచ్చరించింది. ఇందుకు సంబంధించి ఓ నివేదిక వచ్చింది. ఆ నివేదికలో ఉన్న పేర్లలో విశాఖ సిటీ కూడా ఉంది.ఒక వేల సముద్రం ఎంత మేర ముందుకు వస్తే.. విశాఖలో ఏయే ప్రాంతాలు మునిగిపోతాయో ఓ సారి చూద్దాం. ఇప్పటికిప్పుడు దానివల్ల వచ్చిన ప్రమాదం ఏమీ లేదు.. కానీ ఈ శతాబ్దపు చివరి నాటికి. అంటే మరో 80 ఏళ్లలో సముద్ర గర్భంలో విశాఖ చేరిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా ప్రతీ ఏటా సముద్ర జలాల ఎత్తు 0.2 సెంటీమీటర్ల ఎత్తు నుంచి 0.5 సెంటీమీటర్ల ఎత్తువరకు పెరిగే అవకాశం ఉంటుంది. కానీ ఈ మధ్యకాలంలో 0.6 సెంటీమీటర్ల మేర పెరుగుతున్నాయి. ముమ్మందు.. 1 నుంచి 2 సెంటీమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ఈ లెక్కన రాబోయే 80 ఏళ్లకు కనీసం 80 సెంటీమీటర్ల నుంచి 160 సెంటీమీటర్లు సముద్రం పెరుగుతుంది.

అంత మేర సముద్రం తన తీరాన్ని విస్తరించుకుంటే తీర ప్రాంత నగరాలు దాదాపు మునిగిపోతాయి.ఎందుకంటే.. గ్లోబల్ రేటు కంటే ఆసియాలోనే సముద్రపు మట్టాల పెరుగుదల ఎక్కువగా కనిపిస్తోందని ఐపీసీసీ తెలిపింది. గత వందేళ్లలో చూడని విధంగా సముద్రపు మట్టాల్లో మార్పులు చోటు చేసుకున్నాయని ఐపీసీసీ నివేదిక వెల్లడిస్తోంది. 2050 తర్వాత నుంచి మరింత వేగంగా సముద్ర మట్టాలు పెరుగుతాయనేది నిపుణులు అంచనా వేస్తున్నారు.గ్లోబల్ వార్మింగ్.. ఇతర కాలుష్య కారకాలతో పాటు అనేక అంశాలు సముద్ర జలాలను ప్రభావితం చేస్తున్నాయి. మరీ ముఖ్యంగా మంచు పర్వతాలు కరిగిపోవడం దీనికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరగడం, వాతావరణ మార్పులతో మరో 80 ఏళ్లలో మూడు ఫీట్ల మేర సముద్ర మట్టం పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన ముంబై, మంగళూరు, కొచ్చిన్, పారాదీప్, ఖిదీర్‌పూర్, విశాఖపట్నం, చెన్నై, ట్యూటికోరిన్ లాంటి 12 నగరాలు సముద్రగర్భంలోకి వెళ్లనున్నాయి.

## పల్లె వెలుగు రంగులు మారుతున్నాయా

విజయవాడ, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లోని ఏపీఎస్ఆర్‌టీసీ పల్లె వెలుగు బస్సు రంగు మార్చుకుంటుంది. రంగులు మార్చే నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నెల రోజుల క్రితం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా పల్లె బస్సులు సరికొత్త రంగులను అద్దుకోవడంతో మళ్ళీ రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కొన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లోని డిపోల్లో పల్లె వెలుగుబస్సులకు రంగులు మారాయి. ఇప్పటి వరకూ పల్లె వెలుగు బస్సులకు తెలుపు, ఆకుపచ్చ, పసుపు రంగులు ఉండేవి. తాజాగా ఆకుపచ్చ, తెలుపు, నలుపుతో పాటు సన్నటి సిమెంట్ రంగు బస్సులు దర్శనమిస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి వివిధ డిపోలో గ్యారేజీలో ఈ బస్సుల రంగులను మార్చడంలో అధికారులు నిమగ్నమయ్యారు. రంగుల కోసం ఒక్కొక్క బస్సుకు రూ.23 వేలు ఖర్చవుతుందని అధికారులు అంచనాగా చెబుతున్నారు.అయితే ఇలా పల్లెవెలుగు బస్సులు రంగులు మార్చడంపై ప్రతిపక్ష పార్టీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం ప్రారంభించారు. టీడీపీ జెండా రంగు పసుపు రంగులో ఉండటంతో.. ఇప్పుడు బస్సుల నుంచి పసుపును తొలగిస్తున్నారంటూ టీడీపీ నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇదే విషయంపై టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిరామ్ మాట్లాడుతూ వైఎస్ఆర్‌సి ప్రభుత్వం పసుపు రంగును చూసి భయపడుతోందని.. తాము పసుపు రంగుపై ఎలాంటి పేటెంట్‌ను క్లెయిమ్ చేయడం లేదని చెప్పారు. పసుపు రంగుని శుభప్రదంగా ఎప్పటినుంచో భావిస్తారు. అందుకే ఈ రంగు బస్సులకు వేశారని తెలిపారు.ఇలా ఆంధ్రప్రదేశ్ లో బస్సులకు రంగులు మారడం.. దానిపై రాజకీయ దుమారం రేగడం ఇప్పుడేమి కొత్తకాదు. గతంలో కూడా ప్రభుత్వాలు మారినప్పుడల్లా బస్సులు రంగులు మారుతుండేవి. ఇక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగినప్పుడు కూడా తెలంగాణలోని ఆర్టీసీ లగ్జరీ సర్వీసుల రంగును గులాబీ రంగులోకి మార్చడం

ప్రతిపక్షాల విమర్శలకు దారితీసింది.బస్సులు రంగులు మార్చె విషయంపై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ.. బస్సులను పునరుద్ధరించే చర్యల్లో భాగంగా కలర్ మార్చాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. "పాత బస్సులు ఫిట్‌నెస్ పరీక్షకు వెళ్లినప్పుడు తాము కాలానుగుణంగా రంగులను మారుస్తాము. ప్రస్తుతం ఉన్న పల్లె బస్సులు సీట్లు , బాడీతో సహా చాలా మరమ్మతులకు గురయ్యాయి. ఈ బస్సులకు ఫ్రెష్ లుక్ ఇవ్వడానికి, రంగులు మారుస్తున్నామని .. దీంతో బస్సులకు సరికొత్త అందం వస్తుందని.. అంతేకాని మరో కారణం లేదు" అని కృష్ణమోహన్ అన్నారు. అయితే ఇప్పటికే కరోనాతో ఆదాయం భారీగా పడిపోయిన సమయంలో రంగులు మార్చడంతో డిపోపై ఆర్థిక భారం పడుతుందని పలువురు ఉద్యోగులు చర్చించుకోవడం విశేషం

## ఓటీఎస్ పై వెనుకడుగులు

గుంటూరు, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి మరో మారు దిగి వచ్చారు. ప్రజాగ్రహానికి తల వంచారు.ప్రతిపక్ష తెలుగు దేశం పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా, వెల్లువెత్తిన నిరసనలు, జనాగ్రహానికి 'జగనన్న' దిగి వచ్చారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకమని ఓ ముద్దు పేరు తగిలించి, ఎప్పుడో ఏనాడో ఆ నాటి ప్రభుత్వాలు పేద ప్రజలకు వివిధ పథకాల ద్వారా ఇచ్చిన ఇళ్ళకు, ఇప్పుడు రూ. 10 వేల నుంచి రూ.20 వేల వరకు వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటీపీ) చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోమని, లేదంటి రేషన్ సహా సంక్షేమ ఫలాలు అందవని మెడ మీద కత్తి పెట్టి, దుర్మార్గపు వసూళ్ళకు దిగిన జగన్ ప్రభుత్వం, చివరకు దిగి వచ్చింది. ఇంతవరకు గ్రామ వాలంటీర్ల గ్రామ సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ అధికారులకు టార్గెట్లు పెట్టిన ప్రభుత్వం ఇప్పుడు మెట్టు దిగింది. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి,స్వరం మార్చి, '"అబ్బే బలవంతం ఏమీలేదు, ఓటీఎస్ వినియోగించుకోవాలా? వద్దా? అనేది ప్రజల ఇష్టమే" అని చెప్పు కొచ్చారు. ముఖ్యమంత్రి ఈరోజు ఓటీఎస్ పథకం, గృహనిర్మాణంపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ పథకం గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించి, అర్థం చేయించాలన్న ముఖ్యమంత్రి.. ఈ పథకం పూర్తిగా స్వచ్ఛందమేనని చెప్పారు. ప్రజలు ఈ పథకాన్ని వద్దనుకుంటే అవసరం లేదని చెప్పారు. మూడు రాజధానుల విషయంలో ఎలాగైతే చింత చచ్చినా పులుపు చావలేదు అన్నట్లుగా వ్యవహరించారో అదే విధంగా ఓటీపీ విషయంలోనూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఈ పథకం ద్వారా చాలా ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. ఓటీఎస్ ద్వారా పట్టా పొందితే.. ఆ ఇంటిని అవసరాలకు తనఖా పెట్టుకోవచ్చని, కావాలంటే అమ్ముకునే హక్కు కూడా ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. క్లియర్ టైటిల్‌తో రిజిస్ట్రేషన్ జరుగుతుందని వెల్లడించారు. ఓటీఎస్ పథకం ద్వారా అన్నిరకాల సంపూర్ణహక్కులూ ఇంటి యజమానులకు లభిస్తాయని తెలిపారు. పేదలకు మంచి అవకాశాన్ని కల్పిస్తున్నామన్న జగన్.. ఆ అవకాశాలను వాడుకోవాలా? లేదా? అన్నది ప్రజల ఇష్టమేనని చెప్పారు. ఈ పథకం ద్వారా.. రూ.10 వేల కోట్ల భారాన్ని పేదలపై తొలగిస్తున్నామని చెప్పారు.రూ.10 వేల కోట్ల భారాన్ని తగ్గించి ఓటీపీ పేరున ఏకంగా రూ.60 వేల కోట్ల భారం మోతుతున్న విషయాన్ని మాత్రం చెప్పలేదు సీఎం జగన్ రెడ్డి. ఏది ఏమైనా జనాగ్రహానికి తలొగ్గి ముఖ్యమంత్రి మరోమారు మడమ తిప్పారు. అయితే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రభుత్వం ట్రాక్ రికార్డును గమనిస్తే, ఇది వ్యూహాత్మకంగా వేసిన వెనకడుగే తప్ప, మనసు మారి తీసుకున్న మంచి నిర్ణయం కాదని పరిశీలకులు అంటున్నారు. తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతానికి వెనక్కి తగ్గినట్లే తగ్గి, మరో దొంగ దెబ్బ తీసినా ఆశ్చర్య పోనవసరం లేదని కూడా అంటున్నారు.

## డ్రాగన్ ఫ్రూట్... కాసులు



రాజమండ్రి, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)అందరూ వెళ్లే దారిలో వెళ్లాలనుకోలేదాయన.. ఫ్రూట్‌ఫుల్‌గా ఉండే డ్రాగన్ సాగుపై దృష్టిసారించారు. ఔషధగుణాలు అధికంగా ఉండే ఈ పండ్లకు ఉన్న డిమాండ్ తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు వెళ్లి అక్కడ సాగవుతున్న పంటను వారం రోజుల పాటు పరిశీలించారు. ఈ ఏడాది ఆగస్టులో అమెరికన్ బ్యూటీషన్ (ఎంఎం గోల్డ్) రకం విత్తనం తీసుకుని ఎస్.అన్నవరంలో తనకున్న 2.40 ఎకరాల్లో సాగుకు శ్రీకారం చుట్టారు.ఆయనే తూర్పు గోదావరి జిల్లా మెట్ట ప్రాంతానికి చెందిన పోలిశెట్టి రామారావు (టైల్స్ రామారావు). ఒకసారి నాటితే మూడేళ్ల నుంచి 25 ఏళ్లు ఏకధాటిగా (ఫిబ్రవరి నుంచి నవంబర్ వరకు) డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయాన్ని పొందవచ్చని ఆయన చెబుతున్నారు. దీని సాగుకు మెట్ట ప్రాంత నేలలు అనుకూలంగా ఉన్నాయంటున్నారు. ఆరు అడుగులు ఎత్తులో చక్రాకారంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసుకోవాలి. డ్రాగన్ ఫ్రూట్ లభించిన మట్టల నుంచి సేకరించిన విత్తనాన్ని సిమెంట్ స్తంభాల చుట్టూ నాలుగైదు నాటుకోవాలి. మూడు నెలల్లో సిమెంట్ స్తంభాలకు విస్తరిస్తుంది. అప్పటి నుంచి ఒక్కొక్కటిగా డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయం లభిస్తుంది. విస్తారంగా ఫలసాయాన్ని పొందేందుకు నవంబరు, ఫిబ్రవరి మధ్యకాలంలో వచ్చే పూతను రైతులు ఎప్పటికప్పుడు తొలగించడం ఉత్తమం.దీంతో ఫిబ్రవరి నుంచి అధికంగా ఫలసాయం లభించనుంది. తొమ్మిది నెలల్లో ఎకరాకు నాలుగు నుంచి పది టన్నులు డ్రాగన్ ఫ్రూట్స్ లభిస్తాయి. చీడపీడలు ఆశించకపోవడంతో రసాయనక ఎరువులు, మందులు వాడాల్సిన పనిలేదు. విస్తారంగా పంట విరబూసేందుకు గో మూత్రం, వివిధ రకాల ఆకులతో తయారు చేసిన కషాయాల పిచికారీ, కలుపు నివారణ, వేసవిలో రెండు రోజులకు డ్రిప్ పద్ధతిలో ఒక తడుపు వంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి.ఎండవేడిమిని అదుపు చేసేందుకు డ్రాగన్ ఫ్రూట్ చక్రాకార సిమెంట్ స్తంభాలను ఆనుకుని సీతాఫలం మొక్కలు వేసుకోవడం మంచిది. ఫ్రూట్ తొలగించిన రెబ్బలు (మట్టలు) నుంచి రైతు సొంతంగా విత్తనాన్ని తయారు చేసుకోవచ్చు. విత్తనాన్ని విక్రయించుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. పుచ్చకాయ మాదిరిగా తియ్యని రుచి కలిగిన డ్రాగన్ ఫ్రూట్స్‌లో అబ్బుర పరిచే ఎన్నోపోషక విలువలు ఉన్నాయి. రక్తంలో చక్కెర నియంత్రణ, తెల్లరక్త కణాలు, ప్రేగుల్లో మంచి చేసే 400 రకాల బ్యాక్టీరియాల వృద్ధి, క్యాన్సర్, కీళ్ల నొప్పులు, మలబద్ధకాన్ని నివారించడం, రోగ నిరోధక శక్తిని పెంపొందించడం, జీర్ణాశయ రుగ్మతలు తొలగించే పీచు పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో డ్రాగన్ ఫ్రూట్స్‌కి రోజురోజుకీ డిమాండ్ పెరుగుతోంది.డ్రాగన్ ఫ్రూట్స్‌కు ఉన్న డిమాండ్‌తో సాగు చేయాలన్న ఆసక్తి కలిగింది. తెలంగాణ రాష్ట్రం నల్గొండలో వారం రోజులు పంటను పరిశీలించి, సాగు, సంరక్షణ, సస్యరక్షణ తదితర విషయాలపై అవగాహన వచ్చింది. సీజన్‌లో ఎకరానికి నాలుగు నుంచి పది టన్నులు దిగుబడి, రూ.లక్షల్లో ఆదాయం వస్తుందని తెలుసుకున్నాను.

## పెద్దిరెడ్డి ఫ్యామిలీకి అభయం

తిరుపతి, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)ఏ పార్టీలో నైనా నాయకుడు రిజల్ట్ చూపినప్పుడే సత్తా బయటపడుతుంది. అప్పుడే ఆయనకు పార్టీలో ఉన్న స్థానాన్ని తెలియపరుస్తుంది. ఇప్పుడు వైసీపీలో సరైన నేత ఎవరైనా ఉన్నారంటే ఠక్కున వినపడే పేరు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. ఆయన వైసీపీకి అన్ని రకాలుగా అండగా ఉంటున్నారు. ఆర్థికంగా, క్యాడర్ పరంగా, సామాజికపరంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీని బలోపేతం చేస్తున్నారు. అదీ టీడీపీ అధినేత చంద్రబాబు సొంత జిల్లా కావడంతో పెద్దిరెడ్డి ప్రయారిటీ మరింత పెరిగింది. ఏ ఎన్నికలో అయినా? ఏ ఎన్నికయినా పెద్దిరెడ్డి ఇన్‌ఛార్జిగా ఉన్నారంటే అక్కడ గెలుపు తథ్యమన్నది పార్టీ అధినేతకు కూడా విశ్వాసం. పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ ఏ ఎన్నికయినా చిత్తూరు జిల్లాలో వరస గెలుపులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రాధాన్యత మరింత పెరిగింది. కుప్పం మున్సిపాలిటీని ఓడించి చంద్రబాబును మానసికంగా దెబ్బతీయడంతో పెద్దిరెడ్డిని జగన్ మరింత నమ్ముతున్నట్లే కన్పిస్తుంది. ఆయనకు మరో కీలక బాధ్యతను అప్పగించే పనిలో జగన్ ఉన్నారు. వచ్చే ఎన్నికలు జగన్ కు కీలకం. అలాగే చంద్రబాబుకు కూడా. ఇప్పటికే వైసీపీ కుప్పం పై దృష్టి పెట్టింది. అక్కడ ఇన్ ఛార్జి భరత్ ను ఎమ్మెల్సీని చేసింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యూహం ఎలా ఉండనే ఉంది. దీంతో వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును కుప్పం కు కట్టడి చేయాలన్నది వైసీపీ ప్లాన్ గా ఉంది. దీంతో పెద్దిరెడ్డి కుటుంబంలోనే ఒకరికి కుప్పం టిక్కెట్ ఇవ్వాలన్నది దాదాపు డిసైడ్ అయినట్లు సమాచారం. పెద్దిరెడ్డి కుటుంబంలోని సుధీర్ రెడ్డికి కుప్పం టిక్కెట్ ఖరారు కావచ్చు అన్న టాక్ నడుస్తుంది. ఇప్పటికే పెద్దిరెడ్డి కుటుంబానికి మూడు టిక్కెట్లు గత ఎన్నికల్లో ఇచ్చారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి రాజంపేట ఎంపీగా ఉన్నారు. సోదరుడు ద్వారకానాథరెడ్డి తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా ఉన్నారు. నాలుగో సీటు సుధీర్ రెడ్డికి ఇస్తారన్న టాక్ విన్పిస్తుంది. సుధీర్ రెడ్డి పెద్దిరెడ్డి మరో సోదరుడి కుమారుడు. ఆయనైతేనే చంద్రబాబును కుప్పంలో కట్టడి చేయవచ్చన్న అంచనాలో వైసీపీ ఉంది. అయితే వరస గెలుపులతో ఉన్న చంద్రబాబును కుప్పంలో ఓడించడం సాధ్యమా? లేదా? అన్నది పక్కన పెడితే సుధీర్ రెడ్డి బరిలోకి దిగితే కొంత గట్టి పోటీ ఇచ్చే అవకాశముందన్న విశ్లేషణలు విన్పిస్తున్నాయి. జగన్ కూడా ఈ ప్రతిపాదనకు ఓకే చెప్పినట్లు సమాచారం.

## రైల్వే జోన్ పాయె...

విశాఖపట్టణం, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం అనే చేదు కబురు మరో మారు చెప్పింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాల ఆరంభంలోనే తెలుగు దేశం పార్టీ ఎంపీ రామ్మోహన్ నాయుడు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నిత్యానందరాయ్ లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో చావు కబురు చల్లగా చెప్పారు. అయినా హోదా తెస్తామని హామీ ఇచ్చిఅధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నోరు విప్పలేదు. వైసీపీ ఎంపీలు 22 మందిలో ఏ ఒక్కరూ ఇదేమిటని కేంద్రాన్ని ప్రశ్నించలేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విషయం అయితే చెప్పనే అక్కరలేదు, ఆయన ముందుగానే కాడి వదిలేశారు. కాదంటే, కాసింత గట్టిగా అడిగితే కేంద్రం ఎక్కడ కన్నెర్ర చేస్తుందో, సీబీఐ, ఈడీలు ఎక్కడ ఉచ్చు బిగిస్తాయో అనే భయంతో కావచ్చును కేంద్రం దయ మన ప్రాప్తం అనే వేదాంత ధోరణిలోకి వెళ్లి పోయారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపింది. ముగిసిన హామీల హామీల జాబితాలలో విశాఖ రైల్వే జోన్ కూడా చేరింది. విశాఖ రైల్వేజోన్ హామీకి కూడా కేంద్రం తిలోదకాలు ఇచ్చింది. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌పై ఇంకా ఎవరికైనా ఆశలు ఉంటే ఆ ఆశల మీద కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ నీళ్ళు కుమ్మరించారు. ప్రత్యేక హోదా విషయంలో ఎలాగైతే 14 ఆర్థిక సంఘం సిఫార్సులను అడ్డు పెట్టుకుని,కేంద్రం ఇక దేశంలో ఏ రాష్ట్రానికి హోదా ఇచ్చేది లేదని తప్పించుకుందో, అదే విధంగా విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ దేశంలో ఇక కొత్త రైల్వే జోన్‌లను ఏర్పాటు చేసే ఉద్దేశం లేదని తేల్చిచెప్పింది. బీజేపీ ఎంపీ అజయ్‌నిషాద్ ప్రశ్నకు కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ జవాబిచ్చారు. దేశంలో ప్రస్తుతం 17 రైల్వేజోన్లు ఉన్నాయని కేంద్రమంత్రి వెల్లడించారు. విశాఖ రైల్వేజోన్ అంశాన్ని అశ్వనీ వైష్ణవ్ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వాల డిమాండ్ మేరకు.. మరిన్ని జోన్‌లను ప్రకటించే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు.రైల్వేజోన్ సాధ్యాసాధ్యాలపై గతంలో ఓఎస్‌డీని కేంద్రం నియమించింది. రైల్వేజోన్‌పై కేంద్రానికి ఓఎస్‌డీ నివేదిక ఇచ్చింది. అయితే దీనిపై ఎటూ కేంద్రం తేల్చలేదు.మరో వంక ఆత్మ రక్షణలో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గానీ,రాష్ట్ర ప్రభుత్వం గానీ, పార్లమెంట్ సభ్యులు గానీ కేంద్రం పై వత్తిడి చేయలేదు. జగన్ రెడ్డి ప్రభుత్వం అధిఅక్రంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినా ఇంత వరకు కేంద్రం వద్ద రైల్వే జోన్ ప్రస్తవన చేయలేదని, అందుకే అందుకే కేంద్రం గత తెలుగు దేశం ప్రభుత్వం చేసిన అభ్యర్థనలను కూడా అటకెక్కించిందని రైల్వేశాఖ అధికారులు చెబుతున్నారు.ఇక ఏపీలో రైల్వేజోన్ అయ్యే పని కాదని కూడా రైల్వేశాఖ అధికారులు చెబుతున్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం స్పందించని కారణంగానే విశాఖ రైల్వేజోన్‌ను కేంద్రం పక్కన పెట్టిందని రైల్వేశాఖ అధికారులు విమర్శిస్తున్నారు.

## ఆ నాలుగు జిల్లాల్లే...

అనంతపురం, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)గంటకు 10 కోట్లు.. రోజుకు 84 కోట్లు.. వారానికి 585 కోట్లు.. నెలకు 2,500 కోట్లు.. ఏడాదికి 30,535 కోట్లు.. తగ్గేదే లే. కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, విశాఖపట్టణం... ఈ నాలుగు జిల్లాల్లో మద్యం విక్రయాలు దుమ్మురేపుతున్నాయి. మద్యంపై గతేడాదికంటే 10వేల కోట్లు అదనపు రాబడి రావాల్సిందే. పేరుకే దశలవారీ మద్య నిషేధం.. అమ్మకాలు మాత్రం తగ్గేదే లే. తాగినంతా తాగించు.. తాగకుంటే టార్గెట్లు పెట్టి మరీ తాగించు. కలెక్షన్లు తగ్గేదే లే. జగన్ సర్కారు మద్యం పాలసీ ఇది. ఎక్సైజ్ అధికారులకు ప్రభుత్వం విధించిన టార్గెట్లు ఇవి. మద్యంపై వైసీపీ సర్కారు అధికారులకు కొత్త టార్గెట్లు పెట్టింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.20,895 కోట్ల విలువైన మద్యం ఏపీలో అమ్ముడవగా, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.30,535 కోట్ల సరుకు అమ్మాలని ఆదేశించింది. గతేడాదికంటే 10వేల కోట్ల విలువైన మద్యం అదనంగా సేల్ చేయాలని టార్గెట్ పెట్టింది. మద్య నిషేధం అని చెప్పిన జగన్ ప్రభుత్వం.. మద్యం అమ్మకాల్లో మాత్రం రికార్డులు సృష్టిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో మద్యం ద్వారా 18వేల కోట్ల ఆదాయం వస్తే, ఈ ఏడాది 25వేల కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంది. అమ్మకాల విలువ ఆధారంగా మద్యం షాపులను ఏ, బీ, సీ కేటగిరీలుగా ప్రభుత్వం వర్గీకరించింది. అమ్మకాలు ఎక్కువగా ఉంటే ఏ, మధ్యస్తంగా ఉంటే బీ, తక్కువగా ఉంటే సీ కేటగిరీగా విభజించింది. రాష్ట్రంలోని షాపులన్నీ వీలైనంత త్వరగా ఏ-కేటగిరీలోకి వచ్చేయాలని ఒత్తిడి పెంచుతోంది.

# కడపలో డెంగ్యూ డేంజర్ బెల్స్




కడప, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)కడప జిల్లాలో డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత లోపించడంతో దోమల వ్యాప్తి అధికమవుతోంది. దీంతో కొద్దిపాటి జ్వర లక్షణాలు కనిపించినా ప్రజలు ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు. డెంగీ నిర్ధారణ పరీక్షలకు క్యూ కడుతున్నారు. జిల్లాలో 19 డెంగీ కేసులు, 13 మలేరియా కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా నమోదయ్యే కేసుల సంఖ్య మరింత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరుతోపాటు జిల్లా వ్యాప్తంగా డెంగీ కేసులు నమోదవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా డెంగీతోపాటు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతుండటం ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులకు వరంగా మారింది. జ్వరాలు ఎక్కువగా వస్తున్నందున ప్రజలు అది కోవిడ్ వల్ల వచ్చిందా, డెంగీ, మలేరియా, వైరల్ ఫీవరా తెలియక పరీక్షలకు వేలకు వేలు ఖర్చు చేస్తూ అవస్థలు పడుతున్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, ప్లేట్‌లెట్ కౌంట్ పరీక్షల పేరుతో ప్రైవేటు ల్యాబ్‌ల వారు రోగుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. జిల్లాలో కడప రిమ్స్, ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి, పులివెందుల ఆసుపత్రుల్లో డెంగీకి ఎలీషా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు ఇవి అందుబాటులో ఉన్నాయని తెలియక, అవగాహన లేక ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లి నష్టపోతున్నారు. నిజానికి ప్రభుత్వాసుపత్రుల్లోనే డెంగీ నిర్ధారణ పరీక్షలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో ఎక్కువగా దోమ కాటువల్లే సంభవి స్తాయి. వ్యాధి కలిగిన జీవిని ఇది కుట్టి ఆరోగ్యంగా ఉన్న మరో జీవిని కుట్టడం ద్వారా వైరస్ వ్యాప్తి చెందేలా చేస్తాయి. వీటి ద్వారా మలేరియా, బోదకాలు, చికున్‌గున్యా, డెంగీ, ఎల్లో ఫీవర్ వంటి వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రస్తుత వర్షా కాలంలో దోమల వల్ల ప్రతి ఇంట్లో జనం జ్వరాల బారిన పడటం అధికమైంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా దగ్గు, జలుబు, విష జ్వరాలు జిల్లాను వణికిస్తున్నాయి. కేవలం పట్టణాల్లోనే కాదు, పల్లెల్లో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. గతంలో దోమలు ఆయా కాలం, వాతావరణ పరిస్థితులను బట్టి ఉధృతంగా ఉండేవి. అయితే ఇటీవల అన్ని కాలాల్లోనూ, అన్ని వేళల్లోనూ దోమలు ఉంటున్నాయి. ఖాళీ స్థలాలు: పారిశుధ్యంపై మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నిర్లక్ష్యం దోమల ఉధృతి పెరగడానికి కారణమవుతోంది. ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటున్న నీరు, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ఫాగింగ్, స్ప్రేయింగ్ సరిగా చేయకపోవడం వల్ల దోమలు ఎక్కువగా పెరుగుతున్నాయి. దోమల నివారణకు మలాథియాన్ స్ప్రేయింగ్ సక్రమంగా చేస్తున్న దాఖలాలు కన్పించడం లేదు. చాలా మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ మెషీన్లు పనిచేయక మూలనపడ్డాయి. మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రజలు మస్కిటో కాయిల్స్, రిపెల్లెంట్స్ వంటి వాటిని ఉపయోగిస్తున్నారు. దీనివల్ల శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు ఒక వైపు చెబుతున్నా తప్పని పరిస్థితి ఏర్పడుతోంది

డెంగీ లక్షణాలు

- శరీర ఉష్ణోగ్రత పెరగడం
- వాంతులు, విరేచనాలు
- కళ్లు మంటలు, తీవ్రమైన తలనొప్పి
- చర్మ సమస్యలు
- చిగుళ్ల నుంచి రక్తస్రావం
- మూత్రంలో, మలంలో రక్తం పడటం
- కడుపు నొప్పి, జలుబు, దగ్గు
- నీరసం

డెంగీ, మలేరి యా, టైఫాయిడ్ జ్వరాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు, పెద్దలు పారాసిటమాల్ తప్ప వైద్యుల సూచన లేకుండా ఎలాంటి మందులు వాడకూడదు. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలి. 101 డిగ్రీలకు మించి జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, వాంతులు తదితర లక్షణాలు గుర్తిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

# జగనన్న సంపూర్ణ పథకం

కడప డిసెంబర్ 9, (న్యూస్ పల్స్) ప్రతి పేదవాని సొంతింటి కలను నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సంపూర్ణ గృహ పథకాన్ని చేపట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ భాష తెలిపారు. కడప నగరం లోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయం లో జగనన్న సంపూర్ణ గృహ పథక రిజిస్ట్రేషన్ ప్రక్రియను నగర మేయర్ సురేష్ బాబు తో కలసి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు తమ ఇళ్ల పై సర్వ హక్కులు కల్పిస్తూ, అలాగే ఉచితంగా రిజిస్ట్రేషన్ దస్తావేజులు పొందుటకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సంపూర్ణ గృహ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకంపై ప్రజల్లో చైతన్యం తీసుకోవడం జరుగుతుందన్నారు. 1983 నుంచి 2011 వరకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్మించిన ఇళ్లకు వన్ టైం సెటిల్మెంట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ. 10000 మున్సిపల్ ప్రాంతాల్లో రూ. 15000 కార్పొరేషన్ పరిధిలో రూ.25000 చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన రుణం, దానిపైన వడ్డీలు కలుపుకొని దాదాపు 50 వేల నుంచి ఒక లక్ష వరకు నిరుపేదలకు కట్టాల్సి వచ్చిందని, అయితే మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదలు ఎలాంటి కష్టాలు పడకూడదని శాశ్వత గృహ నిర్మాణ హక్కు కింద వారందరికీ స్వంత ఇంటి హక్కును సువర్ణావకాశంగా కల్పించారన్నారు.

భారత దేశంలో ఎక్కడా లేని విదంగా మన రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి పేదలందరికీ దస్తావేజులు ఇస్తున్నామన్నారు. దీంతో లబ్ధిదారులకు ఆఇంటిపై సర్వహక్కులు ఉంటాయన్నారు. అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, తహసీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డితోపాటు కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, కో ఆప్షన్ మెంబెర్లు పాల్గొన్నారు.

# ఏటీఎంలలో మోసాలు చేసే నిందితులు ఆరెస్టు

తిరుపతి అర్బన్ డిసెంబర్ 9, (న్యూస్ పల్స్) త్రిరుపతి నగరంలో ఏటీఎం మెషిన్లకు సాంకేతిక లోపాన్ని సృష్టించి దాని ద్వారా మోసపూరితంగా డబ్బులు సంపాదించే అంతర్రాష్ట్ర నిందితులను తిరుపతి ఈస్టు పోలీసులు అరెస్టు చేసారు. కేసు వివరాలు జిల్లా యస్.పి వెంకట అప్పల నాయుడు మీడియాకు వివరించారు. నిందితులనుంచి వివిధ బ్యాంకులకు సంబంధించిన 99 ఎటిఎం డెబిట్ కార్డులు, 20 వేల రూపాయల నగదు, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు అయన తెలిపారు. జిల్లా యస్.పి మాట్లాడుతూ తిరుపతి పట్టణంలో గత అక్టోబర్ నుండి ఇప్పటివరకు బ్యాంకు ఎటిఎం లలో మిషన్ల కు సాంకేతిక లోపం సృష్టించి ట్యాంపరింగ్ మోసాలకు పాల్పడి న హర్యానా రాష్ట్రానికి చెందిన అరీఫ్ ఖాన్, సలీమ్ ఖాన్ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రత్యక్షంగా 20 వేల రూపాయల నగదు, వారి బ్యాంక్ ఖాతాలో ఉన్న 60 రూపాయల నగదు రెండు తాళంచెవులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి డిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలియజేశారు. ఇదే కేసులు సంబంధించి మరో ముగ్గురు నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు.

## రోజుకో పథకం తుగ్లక్ పాలన :: కాంగ్రెస్

కడప డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)రాష్ట్రంలో రోజుకొక పథకం పేరుతో తుగ్లక్ పరిపాలన కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ నగర అద్యక్షులు విష్ణు ప్రీతమ్ రెడ్డి తెలిపారు.కడప నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనాలోచిత చర్యల కారణంగా రాష్ట్రం లోటు బడ్జెట్ లో కొనసాగుతోందన్నారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ లను సకాలంలో ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఇటువంటి తరుణంలో ప్రజలనుంచి డబ్బులు వసూలు చేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రి తెర తీశారన్నారు. అందులో భాగంగానే ఓటీఎస్ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ అనాలోచిత చర్యల కారణంగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన ఓటీఎస్ పథకం ద్వారా స్వంతింటి కల దేవుడేరుగు ప్రజలు అప్పుల పాలు కావాల్సి వస్తుందన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే పథకాలను అమలు చేయాల్సిందిపోయి వారిపై భారాన్ని మోపే చర్యలకు పాల్పడటం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ అనాలోచిత నిర్ణయాలను ఉపసంహరించుకుని ప్రజలకు మేలు చేకూర్చే పథకాలను అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి వేడుకలు

కాకినాడ తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గోలింగేశ్వర స్వామి ఆలయంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం వేకువజాము నుండే భక్తులు తమ మొక్కుబడులను చెల్లించుకుని ఆలయం వద్ద బారులు తీరారు. షష్టి రోజున స్వామిని వారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు హాజరు కావడంతో షష్టి కి 15 రోజుల ముందునుండే ఏర్పాట్లను ప్రారంభించి పూర్తి చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. లక్షల సంఖ్యలో భక్తులు హాజరు అవడంతో కోవిడ్ నిబంధలను అనుసరించి భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు, సంతానం లేని స్త్రీలు షష్టి రోజు తెల్లవారుజామున ఆలయంలో సహజంగా ఏర్పడిన నాగుల పుట్ట పై చీర ఉంచి ఆ చీరను ధరించి ఆలయం వెనక నిద్రిస్తే వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని ఇక్కడి భక్తుల ప్రగాఢ విశ్వాసం. షష్టి రోజు తెల్లవారుజాము నుండే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తారు. ఇక్కడ ఈ ఆలయం క్రీస్తుశకం తొమ్మిదవ శతాబ్దంకి చెందిన తూర్పు చాళుక్యుల కాలం నాటి కావడం శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయం కావడం ఈ ఆలయం విశేషం.

# పోలీసు ఆంక్షల మధ్య రైతుల మహా పాదయాత్ర

## తిరుమలకు చేరుకోవడం తో రైతుల్లో రెట్టింపు ఉత్సాహం

చిత్తూరు అమరావతి డిసెంబర్ 9 : అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటించాలనే డిమాండ్‌తో రైతులు చేస్తున్న మహా పాదయాత్ర ఇవాల 39 వ రోజుకు చేరింది. 'న్యాయస్థానం టు దేవస్థానం' పేరిట రైతులు యాత్రి చేపడుతున్నారు. పోలీసు ఆంక్షల మధ్య రైతుల యాత్ర ఇవాళ శ్రీకాళహస్తి నుంచి ప్రారంభమైంది. ఇవాళ మధ్యాహ్నం నుంచి రేపటి వరకు యాత్రకు విరామం ప్రకటించారు.తిరుమల వెంకన్నను చేరుకోంటుండటంతో రైతులు రెట్టింపు ఉత్సాహంతో మహా పాదయాత్రను కొనసాగించారు. గురువారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసిన రైతులు.. అక్కడి నుంచి తిరుమల వైపు యాత్రను ప్రారంభించారు. అంతకుముందు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన బిపిన్ రావత్‌తోపాటు ఆయన భార్య, ఇతర అధికారులకు నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం జైజవాన్-జైకిసాన్ అంటూ నినదిస్తూ ముందుకు కదిలారు. ఇవాల్టి యాత్రలో పలువురు రాజకీయ నాయకులు కూడా పాల్గొని తమ మద్దతు ప్రకటించారు.ఈరోజు మధ్యాహ్నం రైతుల మహాపాదయాత్రకు విరామం ప్రకటించనున్నారు.

రేపు కూడా విరామం ప్రకటించే అవకాశముంది. తిరుపతిలో బహిరంగ సభకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాలని రైతులు నిర్ణయించారు. హైకోర్టు తీర్పు కోసం పాదయాత్రను ఈ రోజు మధ్యాహ్నం నుంచి విరామం ప్రకటించారు. కోర్టు తీర్పును అనుసరించి ఎల్లుండి నుంచి తిరిగి యాత్ర కొనసాగనున్నది.

# దేశం కోసం..భార్య భర్తలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)ఇద్దరూ ఇద్దరే .. ఒకరు నిరంతర దేశ సేవలో నిమగ్నమైతే.. మరొకరు సేవా కార్యక్రమాల్లో తన వంతుగా కృషి చేసేవారు. ఇద్దరూ కలిసి ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారు. వీరి మరణం అందరినీ కలచివేస్తోంది. జనరల్ బిపిన్ రావత్ భారత తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా వ్యవహరిస్తున్నారు. రెండేళ్ల క్రితం అంటే డిసెంబర్ 2019లో ఈ పదవిలో బిపిర్ రావత్‌ను నియమించింది కేంద్రం. ఆర్మీ చీఫ్‌గా రిటైర్ అయిన తరువాత ఈ పదవిని చేపట్టారు బిపిన్ రావత్. ప్రస్తుతం భారత్‌లో అత్యంత శక్తిమంతమైన సైనికాధికారి ఆయనే. చైనా, పాకిస్తాన్ దూకుడుకు కళ్లెం వేయడంలో బిపిన్ రావత్‌కు ఎక్స్‌పర్ట్‌గా ఉన్నారు. లద్దాఖ్ సంక్షోభం సమయంలో ఆయన త్రివిధ దళాలకు వ్యూహకర్తగా పనిచేశారు. భారత్ రక్షణ రంగంలో అతిపెద్ద సంస్కరణలకు ఆయన మార్గదర్శి. ఉత్తరాఖండ్‌లోని పౌరీలో రాజ్‌పుత్ కుటుంబంలో ఆయన జన్మించారు బిపిన్‌రావత్. ఆయన తండ్రి లక్ష్మణ్ సింగ్ రావత్ భారత సైన్యంలో లెఫ్టినెంట్ జనరల్‌గా పదవీ విరమణ చేశారు.అయితే, ఆర్మీ హెలికాప్టర్ ప్రమాదంలో బిపిన్ రావత్ తో పాటు ఆయన భార్య మధులిక కూడా మరణించారు. ఈ వార్త కూడా వేలాది మందిని ఆవేదనకు గురిచేసింది. సైకాలజీలో డిగ్రీ చేసిన మధులిక ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎంతో మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు. దీంతో ఆమె మృతి తీరని లోటని కన్నీరుమున్నీరవుతున్నారు. మధులిక తండ్రి దివంగత రాజకీయ నేత మృగేంద్ర సింగ్. మధ్యప్రదేశ్‌లోని షాడోల్ కు చెందిన మధులిక ఢిల్లీలో సైకాలజీలో గ్రాడ్యుయేషన్ చేశారు. ఆ తరువాత సామాజిక సేవకు అంకితమయ్యారు. క్యాన్సర్ బాధితులకు అండగా నిలిచారు మధులిక. ఆర్మీలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల భార్యలు వివిధ వృత్తుల్లో రాణించేలా మధులిక ప్రోత్సహించేవారు. స్వయం ఉపాధి కోర్సుల్లో వారికి శిక్షణ అందించి ఆర్థికంగా నిలదొక్కుకునేలా వారికి అండగా నిలిచేవారు. ఆర్మీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కి ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు మధులిక. విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ అధికారుల భార్యలతో పాటు దివ్యాంగ బాలల జీవితాల్లో వెలుగులు నింపారు

మధులికతమిళిసై నివాళి

నీలగిరి కొండల్లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో సీడీఎస్ చీఫ్ బిపిన్ రావత్, ఆయన సతీమణి మధులికా రావత్‌తో పాటు మరో 11 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఇవాళ నీలగిరి జిల్లాలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ సెంటర్‌లో వీరసైనికుల భౌతికకాయాలకు గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ నివాళి అర్పించారు. సైనికవీరుల పార్థీవదేహాల ముందు పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.గవర్నర్ తమిళిసై తన ట్విట్టర్‌లో సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో మరణించిన ఆర్మీ సిబ్బంది కూడా ఆమె నివాళి అర్పించారు. జనరల్ రావత్ దేశానికి అత్యున్నత సేవలు అందించారని, బాధాతప్త హృదయంతో అమర కుటుంబాలకు నివాళి అర్పిస్తున్నట్లు ఆ ట్వీట్‌లో ఆమె తెలిపారు.

టీడీపీలోకి 40 కుటుంబాల చేరిక

ఒంగోలు డిసెంబర్ 9, (న్యూస్ పల్స్) ప్రకాశంజిల్లా, కంభం మండలం, కందులాపురం పంచాయతీలోని సంజీవ్ నగర్ లో గిద్దలూరు టీడీపీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గౌరవ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కంభం మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు, పార్లమెంట్ కార్య నిర్వహణ కార్యదర్శి కేతన్ శ్రీను, కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంజీవ్ నగర్ కాలనీ లోని 40 కుటుంబాలు టిడిపి పార్టీలో చేరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# బీజేపీ నిరసన

సింహాచలం డిసెంబర్ 9, (న్యూస్ పల్స్) సర్వేనెంబర్ 275 అనుమతులు వెంటనే రద్దు చేయాలి. సర్వేనెంబర్ 275 లో 3500 గజాల కబ్జా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేయాలని గురువారం ఉదయం సింహాచలం తొలి పావంచ దగ్గర బిజెపి శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు.గత ప్రభుత్వం లో టిడిపి ఆధ్వర్యంలో సర్వేనెంబర్ 275 లో సుమారు 3500 గజాలు సింహాచల దేవస్థానం భూమిని కబ్జా చేసి, ఈరోజు పార్టీ కండువా మార్చి వైసీపీ పార్టీలోకి వెళ్లేసరికి దేవస్థాన అధికారులకు కళ్ళు కనిపించడం లేదంటూ బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు.టిడిపి, బిజెపి నాయకులు పైన దాడులు చేయడం, వారిని భయభ్రాంతులకు గురి చేసి వైసీపీ పార్టీలోకి లాక్కునే ప్రయత్నం చేస్తుందని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు అన్నారు.దేవస్థాన భూములను కబ్జా చేస్తుంటే దేవస్థానం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా, జీవీఎంసీ అధికారుల తో కుమ్మక్కై అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సింహాచలం మెయిన్ రోడ్డు పై నిరసన వ్యక్తం చేశారు

# ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

విశాఖపట్నం విశాఖపట్నం మధురవాడలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగుగా జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని లారీ డీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందరు. గురువారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో సంఘటన జరిగింది. మృతులు పోలిపిల్లి రమణ, అయన భార్య పోలిపిల్లి లక్ష్మి, కుమార్తె శాంతి కుమారిగా గుర్తించారు. వీరంతా విజయనగరం జిల్లా పోలిపిల్లిలో బుధవారం శుభకార్యానికి హాజరై గురువారం తెల్లవారుజామున తమ స్వగృహానికి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అప్పన్న సన్నిధిలో బాలయ్య

విశాఖపట్నం అఖండ' మూవీ విజయంతో నటసింహం నందమూరి బాలకృష్ణ ఫుల్ జోష్ లో ఉన్నారు. అఖండ సినిమా ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ దూసుకుపోతోంది. అఖండ సినిమా 'అఖండ' విజయం సాధించిన సందర్భంగా విశాఖలో విజయోత్సవ సభను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చిత్రబృందం సింహాచలంలో సింహాద్రి అప్పన్నని దర్శించుకున్నారు. హీరో బాలయ్య, దర్శకుడు బోయపాటి శ్రీనుతో పాటు'అఖండ టీం అప్పన్న సేవలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజా నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అఖండ సినిమా విజయం సాధించిన సందర్భంగా స్వామివారిని దర్శనం చేసుకున్నామని అన్నారు. సినిమాకు మంచి ఆదరణ చూపించిన ప్రేక్షక దేవుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది మా విజయం మాత్రమే కాదు? చిత్ర పరిశ్రమ విజయం అని పేర్కొన్నారు. ఈ సినిమాతో చలన చిత్ర పరిశ్రమకు ఒక ధైర్యం వచ్చిందని చెప్పారు. మంచి సినిమాలను ఎప్పుడు ప్రేక్షకులు ఆదరిస్తారని తెలిపారు. కాగా, డిసెంబర్ 2న 'అఖండ' సినిమా విడుదల అయిన సంగతి తెలిసిందే. విడుదల అయిన రోజు నుంచే అఖండ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది.

# బెజవాడలో చెడ్డీ గ్యాంగ్ మకాం...

విజయవాడ, డిసెంబర్ 9, (న్యూస్ పల్స్)చీకటి పడితే చెడ్డీలు ధరిస్తారు. చేతుల్లో మారణాయుధాలు పట్టుకొని శివారు ప్రాంతాల్లో సంచరిస్తారు. అడ్డొస్తే అక్కడికక్కడే దాడులకు తెగబడి హతమారుస్తారు. అడవాళ్లు కనిపిస్తే అఘాయిత్యాలకు పాల్పడుతారు. వినడానికే వణుకు పుట్టించే కరుడుగట్టిన చెడ్డీ గ్యాంగ్ మొన్నటి వరకూ హైదరాబాద్‌లో దడ పుట్టించగా.. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో హడలెత్తిస్తోంది. తాజాగా కృష్ణా, గుంటూరు జిల్లాలను చడ్డీ గ్యాంగ్ వణికిస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే మూడు ఘటనలు నమోదుకావడంతో ఈ ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతుండగా.. ఇంతలో మరో ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. పది రోజుల వ్యవధిలో చడ్డీ గ్యాంగ్ ఐదుచోట్ల దొంగతనాలకు పాల్పడింది. చిట్టి నగర్, గుంటుపల్లి, తాడేపల్లి, కుంచనపల్లి అపార్ట్మెంట్లు, విల్లాలలో దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా కృష్ణా జిల్లా పోరంకి వసంత్‌నగర్‌లోని వ్యాపారి సత్యన్నారాయణ ఇంట్లో నాలుగు లక్షల రూపాయల విలువైన బంగారం, వెండి చోరీ చేశారు. శివారు ప్రాంతాల అపార్ట్‌మెంట్‌లే లక్ష్యంగా చెడ్డీగ్యాంగ్ దోపిడీలకు పాల్పడుతోంది. పోరంకి వసంత్ నగర్లో దొంగతనంపై పోలీసులు అలర్ట్ అయ్యారు. సీసీ కెమెరాలతో నమోదైన దొంగలకు సంబంధించిన ఆనవాళ్లతో దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయవాడ పోలీసులు తెలిపారు. అయితే.. విజయవాడలో వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎంటరైన చెడ్డీ గ్యాంగ్ ప్రస్తుతం ఎక్కడ ఉంది? ఎటువైపు వెళ్లారు..? అనేదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నారు. ఒకవేళ విజయవాడలోనే ముఠా సభ్యులు మకాం వేశారా..? అని చర్చించుకుంటున్నారు. అయితే.. తెలుగు రాష్ట్రాలకు చెందిన పోలీస్ రికార్డులు చెబుతున్న దాని ప్రకారం చెడ్డి గ్యాంగ్‌లన్నీ మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్‌లకు చెందినవిగా తెలుస్తోంది.దక్షిణ భారత దేశంపైపు ఉపాధి కోసం వచ్చినట్టు ఇళ్లలోంచి బయల్దేరే ఈ ముఠాలు.. దోపిడీలుకు పాల్పడి.. కొట్టేసిన సొమ్ముతో సొంతూళ్లో పెద్దమనుషుల్లా చెలామణి అవుతారు. ఒకచోట దొంగతనం చేస్తే మళ్లీ ఆ ప్లేస్‌లో చోరీలు చేయరు. అందుకే ఈ ముఠా సభ్యుల్ని పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ప్రస్తుతం ఈ చెడ్డీ గ్యాంగ్ ఆచూకీ కోసం నాలుగు రాష్ట్రాల్లో వెతుకుతున్నారు. ఎటు నుంచి వచ్చారు? ఏవైపు వెళ్లారనేదానిపై ఓ బ్లూప్రింట్ తయారుచేశారు పోలీసులు. దాని ప్రకారం దర్యాప్తు చేపడుతున్నారు.

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సింగరేణి కార్మికుల సమ్మె

## కోల్‌బెల్ట్ వ్యాప్తంగా నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

ఖమ్మం డిసెంబర్ 9 సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. సింగరేణిలోని నాలుగు బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కార్మికుల సమ్మె ప్రారంభమయింది. టీబీజీకేఎస్ తోపాటు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ వంటి జాతీయ సంఘాలు సమ్మెకు మద్దతు ప్రకటించడంతో ఉదయం మొదటి షిఫ్ట్ నుంచే కార్మికులు విధులకు హాజరుకాలేదు. దీంతో కోల్‌బెల్ట్ వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఈ సమ్మె మూడురోజులపాటు కొనసాగనుంది. ఈ సమ్మెలో సుమారు 40 వేల మందికిపైగా సింగరేణి కార్మికులు, మరో 25 వేల మంది వరకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా పాల్గొంటున్నారు.నాలుగు బ్లాకుల వేలం..సింగరేణి పరిధిలో ఉన్న నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికే ఇవ్వాలనేది ఎప్పటినుంచో ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందుకు అనుగుణంగానే ఆ సంస్థ ఇక్కడ సర్వే లాంటి వాటిని నిర్వహించింది. తమకే కేటాయించాలని సింగరేణి కేంద్ర ప్రభుత్వానికి, బొగ్గు మంత్రిత్వ శాఖకు నివేదికలు పంపించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పెడచెవిన పెట్టిన కేంద్రం.. కావాలనే కేకే-6, సత్తుపల్లి బ్లాక్-3, శ్రావణపల్లి, కేవోసీ బ్లాక్-3లను వేలం వేయాలని నిర్ణయించింది.

# ఓ.టి ఎస్ పేరుతో గృహ లబ్ధిదారుల నుండి బలవంతపు వసూళ్ల ను ఆపండి

నంద్యాల డిసెంబర్ 9 ( విభారె) రాష్ట్ర ప్రభుత్వము ప్రభుత్వ గృహాలకు వన్ టైమ్. సెటిల్మెంట్ పేరుతో వాలంటరీ వ్యవస్థ ద్వారా బలవంతపు వసూళ్లు ఆపాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్. బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్. ఏఐటియుసి కార్యదర్శి డి.శ్రీనివాసులు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జి. సోమన్న. సిపిఐ పట్టణసహాయ కార్యదర్శి ఎస్. షరీఫ్ బాష ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలకు గత ప్రభుత్వాలు ప్రభుత్వ భూముల నుండి గృహాలను మంజూరు చేసి హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. గృహ లబ్ధిదారులు అందరూ కూలి నాలి పనులు చేసుకుంటూ అప్పులు చేసుకొని ఇల్లు నిర్మాణం పూర్తి అయిన తర్వాత ప్రశాంతంగా జీవిస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి ఓ టి ఎస్ పేరుతో పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారుల నుండి రుణ విముక్తి పేరుతో పూర్తి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెబుతూనిరుపేదలకు భయభ్రాంతులకు గురి చేస్తూ వారి ని ఇబ్బందులు గురిచేయడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో ఒకవైపు ఉచిత పథకాలు అని చెబుతూనే మరోపక్క రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నింపుకునేందుకు చేసిన అప్పులన్నీ ప్రజల ద్వారా రాబట్టుకునేందుకు గ్రామీణ ప్రాంతాలలో 10వేలు రూపాయలు పట్టణ ప్రాంతాల్లో 15 వేల రూపాయలు కార్పొరేషన్లో 20 వేల రూపాయలు గృహ లబ్ధిదారుల నుండి రుణ విముక్తిపేరుతో డబ్బులు కట్టాలి అని వారిని ఇబ్బందులకు గురి చేయడం దారుణమని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఉచిత పథకాలు అందజేయాలని. ఎవరూ అడగలేదు కానీ అధికారం కోసం వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర లో అన్నీ ఉచితం అంటూ ఆ హామీలను గుప్ప రించి మరోపక్క విద్యుత్ చార్జీలు. నిత్యావసర ధరలు పెంచుతూ ప్రజలపై పెనుభారం వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి ఓ టి ఎస్ పేరుతో జరిగే బలవంతపు వసూళ్లు నిలిపి వేయాలని లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని నాయకులు హెచ్చరించారు.

## సాగు పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం

తుగ్గలి డిసెంబర్ 9 ( విభారె) మండల కేంద్రమైన తుగ్గలి నందు గురువారం రోజున మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అధ్యక్షతన మరియు సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడిఏ మహమ్మద్ ఖాద్రి అధ్యక్షతన మండల వ్యాప్తంగా గల విఏఏ,విహెచ్ఏ,విఎస్ఏ, ఎంపీఈఓ లకు మరియు గ్రామ రైతులకు వేరుశనగ పంట పై,శనగ పంట పై అవగాహన కల్పించారు.ఈ అవగాహన సదస్సులో భాగంగా పీడీ ఆత్మ శ్రీమతి ఉమామహేశ్వరమ్మ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వేరుశనగ పంటలలో పురుగులు,తెగులు వాటి యాజమాన్యం గురించి వివరించారు.వేరుకుళ్ళు నివారణకు సాఫ్ 2 గ్రాముల లీటర్ నీటికి కలిపి మొక్కల మొదలు దగ్గర వెయ్యాలని,అలాగే రసం పీల్చు పురుగుల నివారణకు పసుపు పచ్చ అట్టలు ఎకరానికి 20 ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు.లద్దె పురుగు నివారణకు లార్విన్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని,అలాగే విషపు ఎర 10 కిలోలు వేసుకోవాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో కె.వి.కె యాగంటిపల్లి సీనియర్ సైంటిస్ట్ శ్రీమతి ధనలక్ష్మి,కె.వి.కె శాస్త్రవేత్త బాలరాజు,ఏడిఏడిఆర్సి నంద్యాల గిరీష్, మండలి సలహా మండలి చైర్మన్ సోమశేఖర్ రెడ్డి,ఏఈఓలు రంగన్న,లక్ష్మీ చైతన్య మరియు రైతు భరోసా కేంద్రం ఇన్చార్జులు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలు వైద్యుల సూచనలు తప్పకుండా పాటించాలి...

**డాక్టర్ ప్రవీణ్ కుమార్**

తుగ్గలి డిసెంబర్ 9 ( విభారె) గర్భిణీలు వైద్యుల సూచనలను పాటిస్తూ ఆరోగ్యం పట్ల తప్పకుండా శ్రద్ధ వహించాలని తుగ్గలి ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు.ప్రతి నెల 9వ తేదీన ప్రాథమిక వైద్యశాలలో నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు వైద్య పరీక్షలనునిర్వహించారు.వైద్య పరీక్షల అనంతరం గర్భిణీలకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ మాతా,శిశు మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించడానికి ప్రతినెల కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలియజేశారు.జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతో గర్భిణీలకు అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించి,వారికి మెరుగైన ఆరోగ్యం కొరకు మందులను కూడా అందజేస్తామని మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు.అదేవిధంగా కరోనా వ్యాక్సిన్ పై బాలింతలకు మరియు ఐదు సంవత్సరాలలోపు పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ను వేయించుకొని తల్లి పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన తెలియజేశారు.గర్భిణీలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తీసుకుంటూ,ప్రతి నెల వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి ప్రాథమిక వైద్యశాల సిబ్బంది,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

# కడుపు ఎడమ వైపు నొప్పికి గల కారణాలు ఏమిటి?ఈ నొప్పి ప్రమాదకరమా?



కడుపు నొప్పి చాలా సాధారణమైనదిగా పరిగణించబడుతుంది, కానీ దాని వెనుక గల కారణాలు ఏమిటి. దీని గురించి ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. కొన్నిసార్లు కడుపులో నొప్పి సాధారణం కాదు, ఇది కడుపు యొక్క ఒక నిర్దిష్ట భాగం వైపు బాధిస్తుంది. చాలా సందర్భాలలో, ప్రజలు ఎడమ వైపు కడుపు నొప్పిని కలిగి ఉంటారు. కడుపుకు సంబంధించి వివిధ భాగాలలో నొప్పికి వేర్వేరు కారణాలు ఉన్నాయి. ఆ కారణాల వల్ల వచ్చే నొప్పిని ముందుగానే పసిగట్టి తగిన చికిత్స చేయించుకోవాలి. లేదంటే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. అలా జరగకుండా ఉండాలంటే వెంటనే డాక్టర్ ను కలవడం ఉత్తమం.

ఉదరంలో ఎడమ వైపు కడుపు నొప్పి సాధారణమైనదిగా పరిగణించబడదు. ఎడమ వైపు కడుపు నొప్పి అంటే కడుపు దగ్గర చాలా అవయవాలు ఉన్నాయని, వీటిలో కొన్ని సమస్యలు తెలయజేస్తాయి. కడుపు ఎడమ వైపు నొప్పికి కారణాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం..పొట్టలో పుండ్లు పొట్టలో పుండ్లు

పొట్టలో పుండ్లు ఒక సాధారణ కడుపు నొప్పికి కారణం. ఇది కడుపు పొరలోని మంట వల్ల వస్తుంది. సాధారణంగా, మద్యం సేవించే వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. పొట్టలో పుండ్లు సమస్య చాలా సార్లు అల్సర్‌కు దారితీస్తుంది. కొన్ని రోజులు మీ కడుపు ఎడమ వైపున నిరంతర నొప్పి ఉంటే, అప్పుడు వైద్యుడిని తప్పక సంప్రదించండి.అజీర్ణ సమంకడుపు నొప్పికి ప్రధాన కారణం అజీర్ణ సమస్య అని నమ్ముతారు. కొన్నిసార్లు ఇది కడుపు చికాకు, ఉబ్బరం మరియు ఆమ్లం వల్ల కూడా వస్తుంది. చాలా సందర్భాల్లో అజీర్ణం సమస్య కడుపు ఎడమ వైపు నొప్పిని కలిగిస్తుంది.కాలిక్యులస్కాలిక్యులస్మూత్రపిండంలో రాళ్ళు లేదా రాయి ఉంటే, ఎడమ వైపు నొప్పి ఉండవచ్చు. మూత్రపిండంలో ఖనిజాలు పేరుకుపోయినప్పుడు మూత్రపిండంలో ఒక రాయి ఏర్పడుతుంది. మూత్రపిండంలో చిన్న రాళ్ల వల్ల నొప్పి ఉండదు, కానీ అది సాధారణం కంటే పెద్దది అయినప్పుడు నొప్పి మొదలవుతుంది. మీకు కడుపు ఎడమ వైపు నిరంతర నొప్పి ఉంటే, అప్పుడు కిడ్నీ పరీక్షలు తప్పక చేయించుకోవాలి.ఉదర సిరలు సాగదీయడంఉదర సిరలు సాగదీయడంకొన్నిసార్లు ఇది ఉదర సిరల్లో సాగడం వల్ల కూడా వస్తుంది. కొంతమందిలో, ఇది వ్యాయామం వల్ల కూడా కావచ్చు. కడుపులో సిర వైపు నొప్పి ఉంటుంది. ఈ సమస్య ఎడమ వైపున సర్వసాధారణం ఎందుకంటే సాధారణ మానవుడి కుడి వైపు ఎక్కువ వ్యాయామం చేయగలడు, ఎడమ వైపు తక్కువ సామర్థ్యం ఉంటుంది.క్యాన్సర్ ప్రమాదం కూడా ఉంద్యాన్సర్ ప్రమాదం కూడా ఉందికొన్నిసార్లు కడుపు నొప్పి కూడా కడుపు క్యాన్సర్‌కు కారణం. ఎందుకంటే కడుపులోని క్యాన్సర్ కణాలు ప్రారంభ స్థాయిలో ఉన్నప్పుడు, అప్పుడు అవి తేలికపాటి నొప్పిని ఇస్తాయి. మీకు ఎక్కువసేపు కడుపు నొప్పి ఉంటే, దయచేసి ఈ విషయంలో నిపుణుడిని సంప్రదించండి.మూత్ర మార్గ ఇన్ఫెక్షనమూత్ర మార్గ ఇన్ఫెక్షన్మూత్ర నాళంలో అంటువ్యాధులు ఉంటే, ఉదరం ఎడమ వైపు నొప్పిని రావచ్చు.మూత్రాశయం వాపుమూత్రాశయం వాపుఉదరం ఎడమ వైపు నొప్పికి మరొక కారణం మూత్రాశయంలో మంట. ఒకరికి ఈ పరిస్థితి ఉంటే, కడుపు నొప్పితో వారు తరచుగా మూత్రవిసర్జన చేయవచ్చు.మలబద్ధకంమలబద్ధకంమలబద్ధకంతో, పొత్తికడుపులో ఉబ్బరం ఉదరం ఎడమ వైపు అసౌకర్యం మరియు నొప్పిని కలిగిస్తుంది.

ఎక్టోపిక్ / ఎక్టోపిక్ గర్భంఎక్టోపిక్ / ఎక్టోపిక్ గర్భంస్త్రీకి ఉదరం ఎడమ వైపు నొప్పి ఉంటే, పిండం ఎడమ ఫెలోపియన్ గొట్టంలోకి పెరుగుతుందని అర్థం.



# దేశంలోనే ప్రభాస్ నెం-1..ఆ తర్వాత 'కేజీఎఫ్' స్టార్!




'బాహుబలి' ఫ్రాంఛైజీ అసాధారణ విజయం ఒక గొప్ప పాన్ ఇండియా స్టార్ ని ఆవిష్కరించింది. టాలీవుడ్ హీరో ప్రభాస్ పాన్ ఇండియా రేంజును మించి పాన్ వరల్డ్ స్టార్ గా అవతరించారు. ఒక్క సక్సెస్ డార్లింగ్ ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసింది. స్టార్ డమ్ ని ఎక్కడికో తీసుకెళ్లింది. దేశ..విదేశాల్లో ప్రభాస్ అంటే తెలియని అభిమాని లేడు. భారతదేశంతో పాటు చైనా..జపాన్..థాయ్ లాండ్.. కొరియన్ దేశాల్లో సైతం డార్లింగ్ కి అభిమానులు ఏర్పడ్డారంటే 'బాహుబలి' తనని ఏ స్థాయికి చేర్చిందో చెప్పొచ్చు. దక్షిణాదిన అంతటి ఛరిష్మా కేవలం సూపర్ స్టార్ రజనీకాంత్...కమల్ హాసన్ లాంటి వాళ్లకే సొంతం. బాలీవుడ్ లో అమీర్ ఖాన్..షారుక్ ఖాన్..హృతిక్ రోషన్ లాంటి దిగ్గజ నటులకు ఆ రేంజుంది. అయితే డార్లింగ్ ఇప్పుడు వాళ్లందరినీ వెనక్కి నెట్టేసారన్న టాక్ జాతీయ మీడియాలోనే వైరల్ గా మారింది.పారితోషికం అందుకోవడంలో కానీ.. ఎంపిక చేసుకున్న ప్రాజెక్టుల్లో కానీ.. యూత్ లో క్రేజ్ పరంగా కానీ.. ప్రభాస్ హిందీ నటుల్నే తలదన్ని ముందుకు సాగిపోతున్నారని విశ్లేషణలు ఊపందుకున్నాయి. ఖాన్ లకే సాధ్యం కానిది సాధ్యం చేసి చూపిస్తున్నాడు ప్రభాస్. బాలీవుడ్ హీరోల్ని మించిన క్వాలిటీస్ ప్రభాస్ లో ఉన్నాయన్నది ప్రధానంగా హైలైట్ అవుతోంది. హైట్..వెయిట్..గ్లామర్ ఇలా ప్రతీ అంశంలోనూ డార్లింగ్ వాళ్లందరికంటే ఒక మెట్టు పైనే ఉన్నారన్న ముచ్చట సాగుతోంది. ప్రభాస్ తర్వాత స్థానంలో కన్నడ నటుడు యశ్ పేరు వినిపిస్తోంది. 'కేజీఎఫ్' సంచలన విజయంతో అంతటి క్రేజ్ ని రాకింగ్ స్టార్ యశ్ సొంతం చేసుకున్నాడన్నది ఇండస్ట్రీల్లో సాగుతున్న చర్చ. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన 'కేజీఎఫ్' దేశంలో చాలా భాషల్లో సంచలన విజయాలను నమోదు చేసింది. దాదాపు 300కోట్ల నెట్ వసూలు చేసింది ఈ చిత్రం. హిందీలో యశ్ కి ఊహించని గుర్తింపు..పేరు ..క్రేజ్ తీసుకొచ్చింది కేజీఎఫ్ చిత్రం. ఆ కాన్ఫిడెన్స్ తోనే 'కేజీఎఫ్ -2'ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. బాలీవుడ్ దిగ్గజ నటుల్ని సైతం 'చాప్టర్ -2' లో భాగం చేసారంటే యశ్ క్రేజ్ ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.భారీ అంచనాల మధ్య చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ లో రిలీజ్ చేస్తున్నారు. దేశం మొత్తం ఈ సినిమా కోసం ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురుచూస్తోంది. ఇక ప్రభాస్ నటించిన బాహుబలి -1 దాదాపు 600కోట్లు వసూలు చేయగా.. బాహుబలి 2చిత్రం 1800కోట్లు వసూలు చేయడం ఒక సెన్సేషన్. ప్రభాస్ నటించిన కొత్త సినిమా 'రాధేశ్యామ్' పాన్ ఇండియాలో కేటగిరిలో రిలీజ్ అవుతోంది. సాహో తర్వాత చాలా గ్యాప్ వచ్చింది. ఇప్పుడు రాధేశ్యామ్ తో సంచలనాలు సృష్టించి తన రేంజును మరోసారి చాటుకోవాలని ప్రభాస్ తపిస్తున్నారు.

# నేచురల్ స్టార్ నానికి వైరస గండం

నేచురల్ స్టార్ నానికి వైరస్ గండం పట్టుకుందా? అంటే టాలీవుడ్ వర్గాలు అవుననే సమాధానం చెబుతున్నాయి. యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరితో కలిసి చేసిన 'జెర్సీ' నానికి మంచి పేరుతో పాటు ప్రశంసల్ని కూడా అందించింది. జాతీయ స్థాయిలో ఈ చిత్రానికి ఉత్తమ తెలుగు చిత్రంగానూ ఉత్తమ ఎడిటింగ్ ఇలా మొత్తం మూడు అవార్డులు దక్కాయి. అంతా బాగానే వుంది కానీ ఈ సినిమా తరువాత నుంచి నేచురల్ స్టార్ కెరీర్ ఏమీ బాగా లేదు.'మనం' డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ తో చేసిన 'నాని గ్యాంగ్ లీడర్' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. నిజం చెప్పాలంటే భారీ అంచనాలు పెట్టుకున్న నానికి ఈ మూవీ నిరాశనే మిగిల్చింది అని చెప్పక తప్పదు. ఇక ఆ తరువాత అయినా బాగుందా అంటూ నానిని వైరస్ నీడలా వెంటాడటం మొదలు పెట్టింది. కోవిడ్ యావత్ ప్రపంచాన్ని ఓ ఆట ఆడిస్తున్న విషయం తెలిసిందే. తొలి దశ సమయంలో నాని రివేంజ్ యాక్షన్ థ్రిల్లర్ 'వి'తో థియేటర్లలో సందడి చేయాలని ప్లాన్ చేసుకున్నాడు.కానీ కుదరలేదు. వైరస్ ప్రభావం ఇంకా తగ్గకపోవడంతో 'వి' చిత్రాన్ని ఓటీటీలో విడుదల చేయాల్సి వచ్చింది. ఇక ఫ్యామిలీ ఎమోషన్స్ నేపథ్యంలో తనకు బాగా కలిసి వచ్చిన దర్శకుడు శివ నిర్వాణ తో కలిసి చేసిన 'టక్ జగదీష్'దీ అదే పరిస్థితి. ఈ సినిమా రిలీజ్ సమయంలో సెకండ్ వేవ్ ప్రకంపనలు సృష్టిస్తూ భీతావాహ వాతావరణాన్ని తలపించింది. దీంతో చేసేది లేక మళ్లీ అమెజాన్ ప్రైమ్నే నాని నమ్ముకోవాల్సి వచ్చింది. ఈ సినిమా రిలీజ్ సమయంలో నాని డిస్ట్రిబ్యూటర్లు... ఎగ్జిబిటర్ల నుంచి ఊహించని తిరుగుబాటుని విమర్శల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.ఈ అవాంతరాలన్నింటినీ దాటి తన తాజా చిత్రం 'శ్యామ్ సింగరాయ్'ని ఈ నెల 24న రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నాడు. ఈ సినిమాకు 'ఒమిక్రాన్' అనే కొత్త వైరస్ అడ్డుతగిలే ప్రమాదం వుందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం థియేటర్లు ఓపెన్గానే వున్నా రానున్న రోజుల్లో మారే పరిస్థితులని బట్టి మళ్లీ ఏం జరుగుతుందోనని ప్రజలంతా భయాందోళనకు గురవుతున్నారు. దీంతో నాని సినిమాల రిలీజ్ లకు వైరస్ అడ్డు తగులుతోందని.. నానిని ఒక విధంగా వైరస్ వెంటాడుతోందని ఇండస్ట్రీ జనాలు చెప్పుకుంటున్నారు. మరి ఈ వైరస్ గండం నుంచి నాని తన 'శ్యామ్ సింగ రాయ్'ని బయటపడేయాలని అంతా కోరుకుంటున్నారు.అంతే కాదండోయ్ ఇది వరకు నాని చేసిన చిత్రాలకు 'శ్యామ్ సింగ్ రాయ్'కి చాలా తేడా వుంది. బడ్జెట్ పరంగా.. ఏరియా లిమిటేషన్స్ పరంగా చాలా వ్యత్యాసం వుంది. ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్లో రూపొందింది కాబట్టి ఈ ప్రాజెక్ట్ పై నాని భారీ అంచనాలు పెట్టుకున్నారట. అందుకు తగ్గట్టుగానే రిలీజ్ ని కూడా భారీగానే ప్లాన్ చేసుకుంటున్నారు. మరి ఈ సారైనా నాని తన సినిమాని వైరస్ గండం నుంచి తప్పించి థియేటర్లలోకి తీసుకురావాలని తను కోరుకున్నట్టుగానే ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్ హిట్ కావాలని అంతా కోరుకుంటున్నారు.



# 'భీమ్లా నాయక్ ' కు టెమ్టింగ్ ఆఫర్




కోవిడ్ కారణంగా జనం ఓటీటీలకు ఎగబడుతుండటంతో ప్రస్తుతం ఏ భాషలో విన్నా వారి హవానే కొనసాగుతోంది. పరిస్థితులు ఎప్పుడు ఎలా మారతాయో తెలియని అయోమయ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఓటీటీ ప్లాట్ ఫామ్లకు మునుపెన్నడూ లేనంతగా క్రేజ్ పెరిగింది. థియేటర్కి రావాలంటే సవాలక్ష సేఫ్టీలు అవసరం.. పైగా ట్రావెలింగ్ ఖర్చు తో పాటు ఫుడ్ ఖర్చు కూడా అదనంగా వుండటంతో ఒక్క క్లిక్కుతో ఒక్కరు చూసే ఖర్చుతో ఇంటిల్లి పాదికీ ఇంట్లోనే నచ్చిన సినిమా చూపించేయొచ్చు. ఇదే ఇప్పుడు ఓటీటీ ప్లాట్ ఫామ్లకు బాగా కలసి వస్తోంది.దీంతో భారీ చిత్రాలని కూడా ఓటీటీలో రిలీజ్ చేస్తే బాగుంటుందని.. ఓటీటీ లకు మరింత ప్రచారం.. క్రేజ్ .. వీవర్షిప్ పెరుగుతుందని భావించిన దిగ్గజ ఓటీటీ కంపనీలు వందల కోట్లు కుమ్మరించి భారీ చిత్రాలని సైతం కొనడానికి వెనుకాడటం లేదు. తాజాగా ఓ ప్రముఖ ఓటీటీ దిగ్గజం 'భీమ్లా నాయక్' చిత్రానికి టెమ్టింగ్ ఆఫర్ని ఇచ్చినట్టుగా ప్రచారం జరుగుతోంది. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ దగ్గుబాటి రాణా నిత్యామీనన్ ల తొలి కలయికలో వస్తున్న సినిమా కావడం... ఇప్పటికే మలయాళంలో బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన 'అయ్యప్పనుమ్ కోషియుమ్' కు ఇది రీమేక్ కావడంతో సహజంగానే ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.ఆ అంచనాల్ని దృష్టిలో పెట్టుకునే ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్ ఫ్లిక్స్ 'భీమ్లా నాయక్' కు 225 కోట్ల ఆఫర్ ని ఇచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆఫర్ లో వున్న నిజమెంత అన్నది కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది. నెటఫ్లిక్స్ సంస్థ మార్కెట్ లెక్కలు వేసుకోకుండా ఏ సినిమాని గుడ్డిగా కొనేయదు. అందులోనూ 225 కోట్లు పెట్టి మరీ కొనడానికి ముందుకు రాదు. అది తీసుకునే సినిమాకి వరల్డ్ వైడ్ గా మార్కెట్.. క్రేజ్ వుండాలి... పెట్టిన పెట్టుబడికి మించి అది రికవరీ చేస్తుందో లేదో అంచనాకు రావాలి. అప్పుడే ఏ ప్రాజెక్ట్ కయినా భారీ మొత్తం పెట్టి కొనడానికి నెట్ ఫ్లిక్స్ ముందుకొస్తుందన్నది ఓటీటీ అనలిస్ట మాట. దీన్ని బట్టి 'భీమ్లా నాయక్'కు నెట్ ఫ్లిక్స్ 225 కోట్లు ఆఫర్ చేయడం అన్నది ఫేక్ అని తేల్చేస్తున్నారు. కావాలనే ఈ న్యూస్ని సృష్టించారని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.

# టీమిండియాలో ఒమిక్రాన్ కలకలం..!

దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న భారత-ఏ జట్టులో కరోనా ఒమిక్రాన్ వేరియంట్ కలకలం రేపింది. జట్టు కోచింగ్ సిబ్బందిలో ఇద్దరికి కరోనా పాజిటివ్గా నిర్ధారణ అయినట్లు వార్తలు రావడంతో భారత శిబిరంలోని ఆటగాళ్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. త్వరలో దక్షిణాఫ్రికాలో పర్యటించాల్సిన టీమిండియా సైతం ఈ వార్త విని ఆందోళనకు గురైంది. అయితే, ఆ ఇద్దరు కోచింగ్ సిబ్బందికి రెండోసారి కోవిడ్ పరీక్ష నిర్వహించగా, అందులో నెగిటివ్ రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.వివరాల్లోకి వెళితే.. బ్లూంఫాంటేన్ వేదికగా భారత-ఏ, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న చివరి నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్ సందర్భంగా ఆటగాళ్లందరికీ ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో తొలుత ఇద్దరు టీమిండియా కోచ్‌లకు కోవిడ్ ఒమిక్రాన్ వేరియంట్ పాజిటివ్గా తేలి, రెండోసారి జరిపిన పరీక్షల్లో నెగిటివ్ వచ్చినట్లు ఓ ప్రముఖ దినపత్రిక పేర్కొంది. ప్రాథమిక పరీక్ష ఫలితాలు తప్పు అని క్రికెట్ దక్షిణాఫ్రికా చీఫ్ మెడికల్ ఆఫీసర్ నిర్ధారించినట్లు సదరు పత్రిక తెలిపింది. భారత బృంద సభ్యులందరికీ నెగిటివ్ రావడంతో మ్యాచ్‌ను యధాతథంగా కొనసాగిస్తున్నారు. ఫాల్స్ పాజిటివ్ వచ్చిన ఇద్దరు కోచ్‌లను క్వారంటైన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. కాగా, భారత-ఏ బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులే, బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కోటక్, ఫీల్డింగ్ కోచ్‌గా శుభ్‌దీప్ ఘోష్‌లను బీసీసీఐ దక్షిణాఫ్రికాకు పంపింది. ఇదిలా ఉంటే, కోవిడ్ ఒమిక్రాన్ వేరియంట్ ప్రకంపనల కారణంగా భారత సీనియర్ జట్టు దక్షిణాఫ్రికా పర్యటన వారం ఆలస్యంగా ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో తొలి టెస్ట్ డిసెంబర్ 26న, రెండో టెస్టు వచ్చే ఏడాది జనవరి 3న, సిరీస్‌లో ఆఖరుదైన మూడో టెస్ట్ జనవరి 11న జరగనున్నాయి. అనంతరం వన్డే, టీ20 సిరీస్‌లు ప్రారంభమవుతాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190